

ప్రజలకు మెరుగైన సేవలందించాలి: ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్




సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పోలీస్ శాఖ ముందుండాలని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించి పోలీసింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్‌పి కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. పెదవేగి పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందినుద్దేశించి ఎస్‌పి మాట్లాడుతూ విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టేషన్లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ మల్లేశ్వరరావు, పెదవేగి సిఐ శ్రీనివాస్‌కుమార్, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలోనే అష్టకష్టాలు..!

భారీగా పెరిగిన ఖరీఫ్ సాగు పెట్టుబడి
భారంగా ఎరువులు, పురుగు మందుల ధరలు
ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి
కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం
పెట్టుబడి సాయంపై నోరుమెదపని ప్రభుత్వం



పాలకోడేరులో ఇంజన్‌తో పొలాల్లోని నీటిని తోడుతున్న వైనం

ప్రజాశక్తి - భీమవరం

ఆరుగాలం శ్రమించే రైతన్న కష్టమంతా పెట్టుబడికే సరిపోతుంది. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలు, ఇతర భారాలు రైతులను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెడుతున్న రైతన్న పంట ఆశాజనకంగా పండితే రూ.50 వేల వరకూ వస్తోంది. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ మొత్తాన్ని చేతికి రానీయడం లేదు. దీంతో పేద, మధ్యతరగతి రైతులతోపాటు కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రైతులకు ప్రభుత్వాల నుంచి పూర్తిస్థాయిలో సాయం అందకపోవడంతో కష్టనష్టాల నడుమ ఖరీఫ్ సాగు ముందుకు సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో సార్వా సాగుకు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక రూపొందించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నారుమడులు పూర్తిస్థాయిలో పోయలేదు. జిల్లాలో గత నెల ఒకటో తేదీన కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంత పొలాలకు నీరందే పరిస్థితి లేదు. దీనికితోడు సాగులో పలు సమస్యలు వెంటాడుతుండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకూ కేవలం 40 శాతం మాత్రమే నారుమడుల ప్రక్రియ పూర్తయింది. మిగిలింది మరో వారం, పది రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షల 46 ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది సార్వా సాగు చేయనున్నారు. రెండు జిల్లాల్లో సుమారు ఏడు లక్షల మంది రైతులుండగా వీరిలో సుమారు నాలుగు లక్షల మంది వరకూ కౌలురైతులే ఉన్నారు. నూటికి 80 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. గతంతో పోలిస్తే యాంత్రీకరణ పెరగడం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగాయి. దీంతో పెట్టుబడులకు తగ్గ ఆదాయం రాకపోవడంతో రైతులు సాగుకు దూరమవుతున్నారు. ఎకరాకు సరాసరిన రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరాకు రూ.50 వేల వరకూ వస్తున్నప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే రైతుకు చేతికి అందే పరిస్థితి ఉంటోంది. అదీ ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా పంట సంపూర్ణంగా చేతికి అందితేనే. కొన్ని పరిస్థితుల్లో పెట్టుబడి కూడా రైతులకు వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుర్తింపు కార్డులు లేక, రుణ సాయం అందక, రైతుభరోసా, నష్టపరిహారం, బీమా వంటివేవీ వీరికి అందడం లేదు. జిల్లాలో నరసాపురం, యలమంచిలి, పాలకోడేరు, గణపవరం, భీమవరం రూరల్ పరిధిలోని గ్రామాల్లో భూములు బీడుగా వదిలేస్తున్నారు. గతేడాది సార్వాలో 20 వేల హెక్టార్లలో సాగు చేయకుండా వదిలేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అందని ప్రభుత్వ సాయం

వరిసాగుకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా సహకారం అందలేదని పలువురు రైతులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రభుత్వ లబ్ధి భూయజమాని అంగీకారం లేకపోవడంతో కౌలురైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అయితే ఎక్కువ శాతం కౌలురైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి సాయం అందించడంలో ప్రభుత్వాలు వెనుకంజలోనే ఉంటున్నాయి. ప్రభుత్వం అందించే లబ్ధికోసం సవాలక్ష నిబంధనలు పెట్టి అసలైన సాగుదారులకు అన్యాయం చేస్తున్నారు. సాగులో ప్రధానపాత్ర పోషించే యాంత్రిక పనిముట్లకు ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం రూ.25 కోట్ల వరకూ బడ్జెట్ కేటాయించినప్పటికీ అతీగతీ లేకుండాపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వ్యవసాయానికి నిధుల కేటాయింపుపై సరైన స్పష్టత ఇవ్వలేదు. కేవలం రైతులకు అందించే సాయాన్ని మాత్రమే ప్రకటించారు తప్ప ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

తగ్గుముఖం పడుతున్న వరిసాగు

సవాలక్ష సమస్యలు వ్యవసాయ సాగులో ఉత్పన్నమవ్వడంతో రానురాను సాగు తగ్గుముఖం పడుతోంది. సాగులో కీలకమైన కౌలురైతులు వరుస నష్టాలతో సాగుకు వెనకడుగేస్తున్నారు. లీజు కొన్ని ప్రాంతాల్లో ఒకలా ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో మరోలా ఉంది. అయితే ఈ ఏడాది వరి సాగులో కౌలు రేటు పెరిగినట్టు తెలుస్తుంది. వరిసాగు చేసేవారు లేక కొన్ని ప్రాంతాల్లో కౌలు రేటు తగ్గితే, చేలు బాగా పండే చోట్ల అధికంగా ఉంది. ఎకరాకు 12 బస్తాల నుంచి 16 బస్తాల వరకూ లీజు ఉండేది. అదికాస్తా 10 బస్తాల్లోపు కొన్ని ప్రాంతాల్లో ఆరు బస్తాలకు పడిపోయింది. దీనికి కారణం పెట్టుబడి పెరగడంతో కౌలు రైతులు తగ్గిపోవడమేనని భూయజమానులు అంటున్నారు. ఎకరం ధర రూ.40 లక్షల నుంచి రూ.కోటి ఉంటే ఏడాది మొత్తం వ్యవసాయం చేసినప్పటికీ ఆదాయం మాత్రం రూ.20 వేలు వస్తుందని రైతులు చెబుతున్నారు.

ఎకరానికి పెట్టుబడి ఖర్చులు ఇలా

నారుమడికి రూ.1800, దమ్ముకు రూ.నాలుగు వేలు, గట్టులంకకు రూ.1400, బాగుచేతకు రూ.1400, నాట్లు వేయడానికి రూ.ఆరు వేలు, కలుపు తీతకు రూ.1800, ఎరువులు రూ.ఏడు వేలు, పురుగు మందులు రూ.6800, మాసూలు కూలి రూ.3300, పంట మాసూళ్లకు రూ.7400 మొత్తం కలిపి రూ ఆయా ప్రాంతాలను బట్టి రూ.35 వేలు నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుంది. అయితే ఇటీవల జిల్లాలో కురిసిన వర్షం వల్ల నారుమడులు, నాట్లు వేసిన చేలు నీటమునిగాయి. దీనిలో భాగంగా వర్షపు నీటిని తోడేందుకు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేశారు. దీనికి అదనంగా ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పెట్టుబడి పెరిగింది.

సిసిఆర్‌సి చట్టం రద్దు చేయాలి

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలురైతు సంఘం పశ్చిమ జిల్లా కార్యదర్శి




ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కౌలురైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. సాగులో కౌలురైతులు ఆర్థికంగా అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ప్రభుత్వం మోసగిస్తోంది. రైతు భరోసా, పంట నష్టపరిహారం, పంటల బీమా, బ్యాంకు రుణాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. నామమాత్రంగా అందించి చేతులు దులుపుకుంటున్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట సాగుదారుల హక్కుల చట్టం (సిసిఆర్)ను రద్దు చేయాలి. గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో పంట నమోదు చేయనీయడం లేదు. రాయితీలన్నీ భూయజమానులకు వర్తిస్తున్నాయి. కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.

ఎంపిడిఒ అదృశ్యంపై వీడని ఉత్కంఠ..!

విజయవాడలోని ఏలూరు కాల్వలో కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి - నరసాపురం



ఎంపిడిఒ వెంకటరమణరావు

నరసాపురం ఎంపి డిఒ ఎం.వెంకటరమణరావు అదృశ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. సోమవారం రాత్రి వరకూ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడిన వెంకటరమణరావు ఆ రోజు రాత్రి తనకు పుట్టినరోజే చావురోజని ఒక మెసేజీ పంపడం, ఆయన సెల్ సిగ్నల్ విజయవాడలోని మధురానగర్ సమీపంలో ఏలూరు కాల్వ గట్టు వరకూ పని చేసి నిలిచిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రాత్రి నుండే పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఏలూరుకాల్వ వెంబడి గాలింపు చర్యలు చేపట్టాయి. సుమారు మూడు బృందాలు గాలిస్తున్నా బుధవారం రాత్రి వరకూ ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీనికితోడు కాల్వలో పెద్దఎత్తున గుర్రపుడెక్క ఉండటంతో గాలింపు చర్యలకు ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. ఎంపిడిఒ అదృశ్యం, తర్వాత పంపిన మెసేజీల వెనుక కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఆయన కాల్ డేటా కీలకంగా మారొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 12న జరిగిన మండల పరిషత్ సమావేశంలో కూడా టిడిపి కూటమి ప్రజాప్రతినిధులు మాధవాయపాలెం ఫెర్రీరేవు సొమ్ముపై మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఎందుకు అలసత్వం వహించారని అధికారులను ప్రశ్నించారు. ఆ సమావేశానికి సెలవు రీత్యా రమణరావు హాజరు కాలేదు. రూ.54 లక్షల ఫెర్రీ బకాయిల వసూళ్లు చేయకపోవడంలో ఎంపిడిఒ పాత్ర పెద్దగా లేనప్పటికీ తనను ఎక్కడ బాధ్యుడిని చేస్తారోనని ఆయన ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఫెర్రీని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాతే ఆయన సెలవుపై వెళ్లారు. ఎంపిడిఒ అదృశ్యంపై రాజకీయనేతల పాత్ర, ఫెర్రీ కాంట్రాక్టుదారుని పాత్రపై లోతుగా విచారించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా ఎంపిడిఒ అదృశ్యంపై పూర్తిస్థాయిలో విచారించాలని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడలో ఆయన ఈ అంశంపై అధికారులతో మాట్లాడుతూ ఫెర్రీ బకాయిల వివరాలు తనకు అందజేయాలని, ఈ అంశంలో ఏం జరిగిందనే దానిపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

సొమ్ము స్వాహాపై విచారణ చేపట్టాలి

చంద్రన్నపాలెం డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి
వ్యకాస, ఐద్వా డిమాండ్



మాట్లాడుతున్న శ్యామలారాణి

ప్రజాశక్తి - లింగపాలెం

చంద్రన్నపాలెంలో డ్వాక్రా మహిళలను ప్రభుత్వం ఆదుకుని సొమ్ము స్వాహా చేసిన వారిపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. చంద్రన్నపాలెంలో రామాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డ్వాక్రా మహిళల సొమ్ము రూ.28 లక్షలకుపైగా స్వాహా చేసిన మండల ఎపిఎం, బ్యాంక్ మేనేజర్, గ్రామ విఒఎలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా రుణ బకాయిలు మహిళలు చెల్లిస్తే సదరు ముగ్గురు ఉద్యోగులు కుమ్మక్కై రుణఖాతాలో జమ చేయకుండా సొమ్ము స్వాహా చేశారని ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల సొమ్ము రికవరీ చేసి రుణ బకాయిలకు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళలకు అండగా ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

ఈదురు గాలులు.. కూలిన చెట్లు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం నుండి కన్నాపురం వెళ్లే రోడ్డు మార్గంలో బుధవారం తెల్లవారుజామున ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో పోలవరం నుండి దొండపూడి, కన్నాపురం, కొయ్యలగూడెం జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. స్పందించిన స్థానికులు, ఆర్‌అండ్‌బి సిబ్బంది సంయుక్తంగా వృక్షాలను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రశజాశక్తి - దెందులూరు

గత వైసిపి పాలన వల్ల గ్రామాలన్నీ సమస్యలమయంగా మారాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ చెప్పారు. 'మీకోసం - మీ చింతమనేని' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం పెదపాడు మండలంలోని కొత్త ముప్పర్రు, జయపురం, పాత ముప్పర్రు, తాళ్లగూడెం గ్రామాల్లో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. వాడవాడలా పూల జల్లులు, మంగళ హారతులతో చింతమనేనికి గ్రామస్థుల ఘన స్వాగతం పలికారు. వృద్ధులను, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. గ్రామాల్లోని పారిశుధ్యం నిర్వహణ, చెత్త సేకరణ తరలింపు, రక్షిత మంచినీటి సరఫరా, వీధి దీపాల మరమత్తులు, డ్రెయిన్లు పూడిక తీత, నిర్వహణ, అర్హులకు సంక్షేమ పథకాల అమలు వంటి అనేక సమస్యలను ఎంఎల్‌ఎ చింతమనేని దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. ప్రజా సమస్యలపై సత్వరమే పరిష్కరించేలా అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఏలూరు రూరల్ మండలంలోని పలు గ్రామాలకు తాగటానికి సరైన మంచి నీరు అందటం లేదని, కలుషితమైన జలాల వల్ల ఎంతో మంది అనారోగ్యం పాలవుతున్నారని, గోదావరి జలాలను రప్పించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు చేపట్టినట్లు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. జయపురం గ్రామంలో అధ్వాన్న స్థితిలో ఉన్న బ్రిడ్జిని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎంఎల్‌ఎ చింతమనేని పరిశీలించారు. బ్రిడ్జి సామర్థ్యంపై పూర్తి స్థాయిలో పరిశీలించి తక్షణమే నివేదిక రూపొందించాలని, అవసరం అయితే జయపురం ప్రజలకు కొత్త బ్రిడ్జి నిర్మించేలా ప్రణాళిక రూపొందించటంతోపాటు గ్రామస్తులు తెలిపిన ప్రతి సమస్య సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పర్యటనలో భాగంగా ఎన్‌టిఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూల వేసి నివాళులు అర్పించారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

డిఎంహెచ్‌ఒ శర్మిష్ఠ

ప్రజాశక్తి - టి.నరసాపురం



ఆసుపత్రిని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని డిఎంహెచ్‌ఒ శర్మిష్ఠ సూచించారు. మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం ప్రభుత్వాసుపత్రులను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టి.నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. దిగువ ప్రాంతం కావడం వల్ల వర్షాలకు చుట్టూ ఆవరణ మొత్తం వర్షపు నీరు నిల్వ ఉందని, సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు లేఖ రాయాలని వైద్యులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న అదనపు భవన నిర్మాణ పనులు కూడా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు ఆశాలు, ఎఎన్‌ఎంలు, వైద్యులు పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు గ్రామాల్లో ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జె.కల్పనారాణి, ఫణీంద్ర, ఆంజనేయులు, ఇమామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



వార్డులో పర్యటిస్తున్న చంటి

ప్రజారోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి తెలిపారు. దీనిలో భాగంగానే శానిటేషన్‌పై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. ఆయన బుధవారం స్థానిక 48, 49 డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా డివిజన్లలో నీట మునిగిన రోడ్లు, డ్రెయిన్లను పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో అపారిశుధ్య వాతావరణం ఉండటంపై స్పందించి కార్పొరేషన్ అధికారులకు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ప్రజాధనం, సమయం వృథా కాకుండా నిర్ణీత కాల వ్యవధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారుల్లో కదలిక తీసుకొచ్చేందుకే క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యల పరిష్కార విషయంలో ముందుచూపు కొరవడడంతో అధికారుల్లో సైతం ఉదాశీనత పెరిగిందన్నారు. కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్.పెదబాబు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ చంటి ఆదేశాల మేరకు ఆయా డివిజన్లలో పరిష్కార చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, నెరుసు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా నీటి చౌర్యం

గేట్లు ఎత్తేసిన లస్కర్లు
ఆక్వా చెరువులకు నీరు మళ్లింపు



కాలువలో అమర్చిన మోటార్

ముదినేపల్లి: అధికారులు చెప్పేదొకటి, అందుకు విరుద్ధంగా క్షేత్ర స్థాయిలో జరిగేదొకటి అన్న చందంగా తయారైంది ముదినేపల్లి మండల జల వనరుల శాఖ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది పని తీరు ఈ విధంగా ఉంది. వివరాల్లోకెళితే మండలంలోని సిబి కెనాల్‌కు ఆదివారం అధికారులు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. ఈ నీరు కేవలం తాగునీటి అవసరాల కోసమేనని, అందుకు విరుద్ధంగా ఎవరైనా ఆక్వా చెరువులకు మళ్లిస్తే వారిపై చర్యలు తీసుకుంటామంటూ ఎంఎల్‌ఎతో పాటు సంబంధిత శాఖ అధికారులు వింజరం లాకుల వద్ద తాగునీటి విడుదల సందర్భంగా ఊదరగొట్టారు. అయితే అందుకు విరుద్ధంగా మండలంలో కాలువ ద్వారా వస్తున్న తాగు నీటిని ఆక్వా రైతులు కాలువలో ఆయిల్ ఇంజన్లు, కరెంటు మోటర్లు ఏర్పాటు చేసి ఆక్వా చెరువులకు తోడేస్తున్నారు. ఈ తంతు అంతా గత రెండు రోజులుగా జరుగుతోంది. బుధవారం సాయంత్రం ప్రజాశక్తి విలేఖరి సిబి కెనాల్‌ను పరిశీలించేందుకు వెళ్లగా ఈ తంతు అంతా బయటపడింది. శ్రీహరిపురం వంతెన వద్ద నుంచి బొమ్మినంపాడు వంతెన వరకు 10 కిలో మీటర్లు కాలువను పరిశీలించగా కాలువ గట్లపై ఆయిల్ ఇంజన్లు, కరెంట్ మోటర్లు పంట కాలువ నుంచి నీటిని జోరుగా తోడుతూ దర్శనమిచ్చాయి. ఈ కాల్వ పరిధిలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ పాయింట్స్(డిపిలు) గేట్లు ఒకటి, ఆర మినహా అన్ని తూముల గేట్లను లస్కర్ ఎత్తేశారు. దీంతో కాలువలోని నీటిని ఆక్వా రైతులు చేపల, రొయ్యల చెరువులకు మళ్లిస్తున్నారు. దీంతో తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీరు ఆక్వా చెరువుల పాలవుతోంది. నియోజవర్గంలో మంచినీటి చెరువులు అడగంటి తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చడంతో మొదటి ప్రాధాన్యతగా మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపుకునేందుకుగాను విడుదల చేసిన తాగునీరు ఆక్వా చెరువులను నింపుకునేందుకు ఉపయోగపడుతుంది. దీంతో పై స్థాయి అధికారులు పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనబడుతుంది. అధికారులతో పాటు కింది స్థాయి లస్కర్లు వారిష్టారాజ్యంగా ఆక్వా రైతులు వద్ద భారీగా ముడుపులు తీసుకుని తాగునీటిని ఆక్వా చెరువులకు వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. సిబి కెనాల్ పరిధిలో గోకినంపాడు, కోమర్రు, కొరగుంటపాలెం, అల్లూరు గ్రామాల పరిధిలోని ఆక్వా చెరువులకు జోరుగా నీటిని ఇంజన్లు, మోటార్ల ద్వారా తోడేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి చౌర్యాన్ని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజల కోసమే ఉచిత ఇసుక

ఇసుక ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1800-425-6025
డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్



ఇసుక డంప్ వద్ద డిపిఒ విశ్వనాథ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రజల కోసమే ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందని, దళారీ వ్యవస్థ లేకుండా ప్రజలు నేరుగా ఇసుక డిపో నుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, జిల్లాస్థాయి శాండ్ కమిటీ సభ్యులు తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. చేబ్రోలులోని ఇసుక డిపోను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రజలు నేరుగా ఇసుక డిపోలకు వచ్చి రోజుకు 20 టన్నుల ఇసుకను ఆధార్ కార్డు చూపించి ఉచితంగా పొందవచ్చని అన్నారు. జిల్లాలో చేబ్రోలుతోపాటు కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేటలో స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.538, వింజరం (కుక్కునూరు మండలం) స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.362 రూపాయలు, ఇబ్రహీంపేట (కుక్కునూరు మండలం) స్టాక్ పాయింట్ వద్ద రూ.210 చొప్పున ఛార్జీలుగా జిల్లాస్థాయి శాండ్ కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ మొత్తాన్ని రీచ్ ప్రాంత రహదారులు, ర్యాంపులు తదితరాల అభివృద్ధికి వినియోగిస్తారన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే రూ.పది వేల నుంచి రూ.లక్ష వరకూ జరిమానా విధిస్తామని తెలిపారు. ఇసుక అక్రమాలు నివారించడానికి, సహకారానికి టోల్ ఫ్రీ 1800-425-6025 నెంబర్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని డిపిఒ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 75 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉందన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో తొమ్మిది మంది తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా చిన్నారుల కోసం ఉత్సాహవంతమైన యువకుల నుంచి రక్తాన్ని సేకరించడానికి జిల్లాలోని డిగ్రీ, పీజీ కళాశాలల వద్ద అధునాతన పరికరాలతో కూడిన ఎసి మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సును పెడుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. తలసేమియా చిన్నారులు, వారి సహాయకులు 25 మందికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అడుసుమిల్లి సత్యనారాయణ భోజన ఏర్పాట్లు చేశారని, పండ్లను కె.రామ్ శ్రీభాస్కర్, మోతే అనుపమాలు పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాదరావు, బిఆర్‌సిహెచ్.నారాయణ, డాక్టర్ జి.స్పందన, లయన్స్ డిస్ట్రిక్ ఉమెన్ లీడర్ కె.పద్మావతి, కెవి.రమణ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ల నుంచే ఇసుక రవాణా

డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అనుమతి ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేసుకోవాలని పోలవరం డిఎస్‌పి ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం టి.నరసాపురం స్టేషన్ పరిధిలో పోక్సో కేసు దర్యాప్తు నిమిత్తం వెళ్తూ స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద ఆగారు. సర్కిల్ పరిధిలోని కేసుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనుమతి ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేసుకోవాలన్నారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఇష్టానుసారం వాగుల గుండా రవాణా చేస్తే సహించేది లేదన్నారు. అదేవిధంగా వర్షాలు అధికంగా కురుస్తుండటంతో వరదలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సరిహద్దు గుండా గంజాయి, నాటుసారా, ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐ టి.క్రాంతికుమార్, ఎస్‌ఐలు వి.చంద్రశేఖర్, మహేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


గుర్రపు డెక్క తొలగించిన కాలువ

కాలువలో గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు జలవనరుల శాఖ అధికారులు స్పందించి తాగునీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న గుర్రపు డెక్కను బుధవారం తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డంకిగా గుర్రపు డెక్క అనే శీర్షికతో ఈనెల 15వ తేదీ సోమవారం ప్రజాశక్తిలో వార్త వెలువడిన విషయం పాఠకులకు విధితమే. దీనిపై స్పందించిన ముదినేపల్లి సెక్షన్ జల వనరుల శాఖ అధికారులు ముదినేపల్లిలోని పోల్‌రాజు కెనాల్‌పై కాలిబాట వంతెన వద్ద కెనాలకు దట్టంగా పట్టిన డెక్కను కూలీలతో తొలగింపు చేశారు. డెక్క తొలగించడంతో కాలువలో నీరు సాఫీగా ప్రవహిస్తుంది.

డ్రెయినేజీలో పూడిక తొలగింపు

ముసునూరు: వర్షాకాలంలో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో దోమలు, ఈగలు చేరి గ్రామంలోని ప్రజలు జ్వరాల భారిన పడే పరిస్థితి ఉందని, ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా డ్రెయినేజీలో పూడిక తీయిస్తున్నట్లు గ్రామ సర్పంచి పుట్టా మోహన్ రావు తెలిపారు. బుధవారం మండలంలోని వేల్పుచర్ల పడమర హరిజనవాడలో గత కొన్ని సంవత్సరాలుగా డ్రెయినేజీ పూడిక తీయకపోవడంతో అధ్వానంగా ఉన్న పరిస్థితుల్లో స్థానిక ప్రజలు అవస్థలు గ్రహించి దగ్గరుండి డ్రెయినేజీ పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించారు. పుట్ల మోహనరావు, టిడిపి నాయకులు గరికిముక్కు నాని, లక్ష్మణ, దేవేంద్ర, రాజు, రాము, నవీన్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

దెందులూరు : పెరుగుతున్న పారిశ్రామికీకరణ, యాంత్రిక విధానాల వల్ల మన చుట్టూ ఉండే పర్యావరణం రోజురోజుకీ నాశనమై కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోందని, దాని నుంచి పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం గ్రామదీప్ సంస్థ ప్రతినిధులు, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బందితో కలిసి ఆయన తొలి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ కూలర్‌లో నీళ్లు పోయటం, ఎసిలతో కరెంట్ బిల్లులు పెంచటం కాదని, ప్రతి ఒక్క వ్యక్తి తమ పేరు మీద ఒక మొక్కను నాటి దానికి నీళ్లు పోయటం, సంరక్షించడం, తద్వారా ప్రకృతిని కాపాడటం ప్రజలు అలవాటు చేసుకోవాలన్నారు. పచ్చదనం - పరిశుభ్రంకి ప్రాధాన్యతను ఇస్తూ దెందులూరు నియోజకవర్గంలో వేలాది సంఖ్యలో చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న దుగ్గిరాల గ్రామ సర్పంచి గుంజా క్రీస్తుమణి మధు, పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు బొప్పన సుధ, గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

కలిదిండి: ఏకలవ్యుని జయంతి సందర్భంగా ఏకలవ్య సంఘం మండల అధ్యక్షులు కుంబా నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఏకలవ్యుని విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, ఎంపిడిఓ దినతేజ్, అమల, రాజు, దాసు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులు అరెస్టు

టి.నరసాపురం: మండలంలోని గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకునితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు యువకులు మొత్తం నలుగురిని అరెస్టు చేసినట్లు పోలవరం డిఎస్‌పి కె.సురేష్ కుమార్ రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. అత్యాచార ఘటనపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు నాగకుమార్‌తో పాటు అతనికి సహకరించిన ముగ్గురుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. అరెస్టు చేసిన వారిలో ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరావు ఉన్నారు.

డ్రెయిన్‌లో కలుపు నివారణ మందు పిచికారీ

ఉంగుటూరు : నాచుగుంట క్వారీ మురుగు బోదెలో గుర్రపు డెక్క తొలగింపు దాదాపు పూర్తియిందని డ్రెయిన్స్ ఎఇ సత్యనారాయణ వెల్లడించారు. నీటి ప్రవాహంపై నాచు పువ్వు అలుముకుందని, దాని నివారణకు కలుపు మందును పిచికారీ చేయిస్తున్నామని తెలిపారు. వెల్లమిల్లి రేవు వద్ద బోదెపై అడ్డుగా ఉన్న అనధికార కట్టడం తొలగించేందుకు యజమానితో మాట్లాడుతున్నామన్నారు. స్థానిక రైతులు అప్పారావు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యం

ఎంఎల్ఎ బడేటి చంటి

ఏలూరు సిటీ: పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ముఖ్యంగా గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారికి అత్యంత ఖర్చుతో కూడిన వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు తమ పరిధిలో చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టంచేశారు. ఆ దిశగా ప్రభుత్వ - ప్రయివేటు భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని, ఇందులో భాగంగానే జిల్లా ఆసుపత్రిలో ఈనెల 21వ తేదీ ఆదివారం విజయవాడకు చెందిన పిన్నమనేని కార్డియాక్ అండ్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైద్య శిబిరం వివరాలను ఆయన వెల్లడించారు. ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలతో పాటు నిష్ణాతులైన వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్య సేవలను ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఏలూరు నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మీడియా సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, మారం అను పాల్గొన్నారు.

డిఐజిని కలిసిన ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్: ఏలూరు రేంజ్‌లో ఎస్‌పిలుగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పిలు ఏలూరు రేంజ్ డిఐజి జిఐజి అశోక్ కుమార్‌ను బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌పిలకు స్థాన చలనం కల్పిస్తూ డిజిపి నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఏలూరు రేంజ్ లోని తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పిగా నరసింహ కిషోర్, కృష్ణాజిల్లా ఎస్‌పిగా ఆర్.గంగాధర్ రావు, కాకినాడ జిల్లా ఎస్‌పిగా విక్రమ్ పాటిల్, అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బి.కృష్ణారావు నియమితులై ప్రభుత్వ ఉత్తర్వులు చేసింది. వీరంతా బుధవారం ఆయా ప్రాంతాల్లో జిల్లా ఎస్‌పిలుగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బుధవారం సాయంత్రం ఏలూరు రేంజ్ డిఐజి జిఐజి అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా ఏలూరు నగరంలోని రేంజ్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్ నందు కలిశారు. ఆయనకు వారు పుష్పగుచ్ఛాలు అందించారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

బుట్టాయగూడెం: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాతృభాషా ఉపాధ్యాయులు బుధవారం జరిగినటువంటి ప్రజాదర్బార్‌లో మానవ వనరుల శాఖ మంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కలిశారు. వారి సమస్యలను వివరించారు. సమాన పనికి సమాన వేతనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, గిరిజన ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల భవిష్యత్తు, అభివృద్ధికి తోడ్పడుతున్న గౌరవ మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి మీ కృషిని, శ్రమని గుర్తించి తగిన వేతనాన్ని అందించే విధంగా కృషి చేస్తామని, దీనిపై పూర్తిగా స్టడీ చేసి తమకు సమాచారం అందిస్తామని హామీ ఇచ్చారు.

యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని బాపునగర్‌కు చెందిన కొవ్వలి సంజయ్ అనే యువకుడిపై గంజాయి బ్యాచ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు బ్లేడుతో దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన సంజయ్‌ను నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహస్య ప్రాంతాల్లో నుంచి గంజాయి తీసుకురావడంలో ముగ్గురు వ్యక్తులు బలవంతం చేయడంతో తాను నిరాకరించినందుకు బ్లేడుతో దాడి చేశారని సంజయ్ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వానొస్తే చిత్తడి చిత్తడే!


ఏలూరు టౌన్: రహదారి మధ్యలో నిలిచిపోయిన వర్షపునీరు

రోడ్లపైకి మురుగు నీరు.. ప్రజలు బేజారు

ఎటుచూసినా చెత్తకుప్పల దర్శనం..

అధికారుల పర్యవేక్షణా లోపం.. నగరానికి శాపం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్వచ్ఛ ఏలూరు, సుందర ఏలూరు అంటూ అధికారులు చెప్పుకోవడానికి తప్ప క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నగరంలో రెండు మిల్లీమీటర్ల వర్షానికే రోడ్లు చిత్తడి, చిత్తడిగా మారుతున్నాయి. కొన్ని రోడ్లల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటోంది. మురుగు డ్రెయిన్లలో నుంచి వచ్చే దుర్వాషనకు ప్రజల ముక్కుపుటలు అదిరిపోతున్నాయి. అధికారులు చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చిద్రంగా ఉన్న రహదారిలో ఎంఎల్ఎ బడేటి చంటి(ఫైల్ ఫొటో)

ముందస్తు చర్యలేవి: వేసవి కాలం వస్తుందంటే పట్టణాలు, నగరాల్లో మురుగు కాలువల్లో పేరుకున్న సిల్టును తొలగించేలా ముందస్తు ప్రణాళిక వేసుకోవడం సర్వసధారణం. అలాంటిది సుమారు 5 లక్షల మంది నివసిస్తున్న ఏలూరు నగరంలో అలాంటి చర్యలేవి చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో వందల కిలోమీటర్లలో విస్తరించి ఉన్న ఏలూరు డ్రెయిన్లల్లో మురుగు పేరుకుపోయింది. ఇప్పుడు వర్షాకాలం ఆరంభమై నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ అదే పరిస్థితి. చాలా డ్రెయిన్లలో సిల్టు, చెత్త, చెదారంతో నిండిపోయింది. దీంతో కొద్దిపాటి వర్షానికే డ్రెయిన్లు నిండిపోయి, మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. పవర్‌పేట రోడ్డు, బిర్లా భవన్ చేటపర్రు రోడ్డు, ద్వారకా నగర్, కోడెలు, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి మురుగు నీరు చేరి ప్రజలు నానాయాతన పడుతున్నారు. అనారోగ్య సమస్యలతో ఆందోళన చెందుతున్నారు.

రోడ్లపైకి చేరిన మురుగును నగరపాలక పారిశుద్ధ్య విభాగం సిబ్బంది శుద్ధి చేయడం లేదు. ప్రజలే నీటితో శుద్ధి చేసుకుని తమ పనులు చక్కదిద్దుకుంటున్నారు. ఇక రోజువారి సిబ్బంది డ్రెయిన్‌లో మురుగును తొలగించడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. దీంతో మురుగు కాలువల్లో చేరుకున్న చెత్తాచెదారం కుళ్లి దుర్వాసన వెదజల్లుతుంది. జాలిపూడి డ్రెయిన్, రైల్వేస్టేషన్ - చాటపర్రు రోడ్డు, ఫీల్ హౌస్ పేట డ్రెయిన్, వంగయగూడెం డ్రెయిన్, సుంకరి వారి తోట డ్రెయిన్, ద్వారాకానగర్‌లోని పలు డ్రెయిన్‌లలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. పారశుధ్య సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో సిబ్బంది, ఒప్పంద పద్ధతిలో చేసే సిబ్బంది సక్రమంగా పనులు చేయడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో అయినా మారతారు అనుకుంటే ఏ మార్పు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇదేం శుద్ధి: ఏలూరు నగరంలో బహిరంగ మలవిసర్జన జరుగుతుందన్న మాట బహిరంగ రహస్యం. ప్రస్తుత కమిషనర్ బాధ్యతలు తీసుకున్నాక ఇలాంటివి నిరోదిస్తామని చెప్పినా తర్వాత గాలికివదిలేసినట్లే కనిపిస్తోంది. నగరంలో చాలా రోడ్లలో చెత్త కుప్పలే దర్శనం ఇస్తున్నాయి. సిబ్బంది హోటల్లు, ఆసుపత్రుల వద్ద లంచాలకు కక్కుర్తిపడి వాటిపై చూపుతున్న శ్రద్ధ, చెత్త కుప్పలు తొలగించడంపై లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏలూరు మార్కెట్‌లోనూ ఇప్పుడు చెత్త దర్శనం ఇస్తూనే ఉంది. ప్రజా ప్రతినిధులు తిరిగే ప్రధాన రహదారులు మాత్రం శుభ్రం చేసి, మిగిలిన రోడ్లపై మాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో నగరంలో అపారిశుధ్యం తాండవిస్తోంది. ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా శ్రద్ధపెట్టి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి సిపిఎం జిల్లాస్థాయి సమావేశాలు

జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఈనెల 18, 19, 20 తేదీల్లో పట్టణంలోని రోటరీ హాల్‌లో నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కార్యకర్తలకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం టౌన్ సిపిఎం కార్యాలయంలో బుధవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. టౌన్ కన్వీనర్ పి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ శిక్షణా తరగతులకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వై.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడతారని తెలిపారు. నిత్యం సామాన్య ప్రజలు, కార్మిక రైతులు, వ్యవసాయ కార్మికుల బాగు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) సిపిఎం ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య ఆనాడు వేసిన బాటలో ముందుకు సాగుతూ సమాజంలో పేదరికం పోయి కష్టజీవుల సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్ర అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని అన్నారు. పట్టణంలో ఆసీల పన్ను దందా పెరిగిందని, గతంలో ఈ అధిక వసూళ్ల సమస్య పరిష్కారం చేయమని అధికారులకు పలుమార్లు సిపిఎం వినతిని ఇచ్చినప్పటికీ నేటికి ఈ దందా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా పట్టణంలో పారిశుధ్యం, మంచినీరు, డ్రెయినేజీ, వీధిలైట్లు, రోడ్లు తదితర సమస్యలు పరిష్కరించటంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో నివసిస్తున్న పేదలకు అర్బన్ హౌసింగ్ కింద వేలాది ఇల్లు కట్టించారని, నేటికీ ఆ ఇల్లు బాధితులకు అప్పగించడంలో ప్రభుత్వాధికారులు విఫలమయ్యారని గుర్తు చేశారు. వెంటనే పేదలకు కట్టించిన ఇల్లు వారికి అప్పచెప్పాలని అధికారులను డిమాండ్ చేశారు. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న పట్టణంలో ఏరియా హాస్పిటల్ ఉన్నప్పటికీ, అందులో ఉన్న డాక్టర్స్, స్టాఫ్ కొరవతో పేదలకు నాణ్యమైన వైద్యం అందించకపోవడం శోచనీయమని, వైద్యం అందక పేదలు మృత్యువాత పడుతున్నారని, ఎంఎల్ఎ సొంగా రోషన్, ఎంపీ పి.మహేష్ కుమార్ ఏరియా హాస్పిటల్‌లో సిబ్బంది కొరవ లేకుండా చూడాలని, హాస్పిటల్స్‌కి పరికరాలు, ల్యాబ్స్ మెడికల్స్, తదితర సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాలకు ఆర్థికంగా సహాయ సహకారాలు పార్టీలకు అతీతంగా నాయకులు, రైతులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, ప్రజా శ్రేయస్సు కోరుకునే యావన్మంది ప్రజానీకం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్ రావు, పిల్లి చంటి పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలిస్తున్న హాస్టల్ వార్డెన్

'పది'లో గర్ల్స్ హాస్టల్ విద్యార్థుల ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ముసునూరు

తమ హాస్టల్‌లో చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థునులు నూటికి నూరు శాతం పాసై ప్రతిభ కనబరిచారని ముసునూరు మండల గర్ల్స్ హాస్టల్ వార్డెన్ ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ 2024-2025 విద్యా సంవత్సరంలో తమ హాస్టల్‌లో 26 మంది 10వ తరగతి పరీక్షలు రాయగా అందరూ పాసై నూటికి నూరు శాతం విజయం సాధించారన్నారు. తమ హాస్టల్‌లో ప్రతిరోజు మెనూ ప్రకారం భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం, సాయంత్రం పూట శిక్షణా తరగతులు నిర్వహించి వారిలో వెనకబాటు ఉన్నవారిని గుర్తించి, వారిని కూడా మంచి మార్కులతో విజయం సాధించే వైపుగా తీసుకెళ్తున్నట్లు తెలిపారు. టూటర్స్‌ను ఏర్పాటు చేసి తరగతి గదుల్లో కాకపోయినా కనీసం హాస్టల్లోనైనా మంచి మార్కులు సాధించే దిశగా ప్రణాళికలు తయారుచేసి, అభివృద్ధి దిశగా హాస్టళ్లను తీసుకెళుతున్నట్లు ఆమె తెలియజేశారు. గతంలో మండలకేంద్రమైన ముసునూరులో బాలికల హాస్టల్‌లో తమ పిల్లలను జాయినింగ్ చేయాలంటే తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నుచం నేడు ఆ హాస్టల్‌లో మన పిల్లలు చదువుకుంటే మంచి మార్కులతో పాస్ అవుతారనే ఆకాంక్షతో తల్లిదండ్రులు ఉన్నారన్నారు. హాస్టళ్ళ, పాఠశాల ఒకే ప్రాంగణంలో పక్కపక్కన ఉండటం కూడా ఆడపిల్లలకు మంచి భద్రతతో కూడిన ఏర్పాట్లు కలిగి ఉన్నాయని తెలిపారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - ముదినేపల్లి


పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న సర్పంచి

ముదినేపల్లిలోని గుడ్లవల్లేరు రోడ్‌లో మురుగునీటి సమస్య పరిష్కారానికి గాను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పక్కా సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను బుధవారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు, ఉప సర్పంచి ఈడే సుధాకర్ ప్రారంభించారు. 120 మీటర్లు పొడవును, 2.5 మీటర్ల వెడల్పున డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10.55 లక్షలు వెచ్చించి డ్రెయిన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ముదినేపల్లి-గుడ్లవల్లేరు ఆర్అండ్‌బి రహదారి ముదినేపల్లిలో పల్లంగా ఉంటుంది. ఈ రోడ్డులో డ్రెనేజీలు రోడ్డు కన్నా ఎత్తులో ఉండటం, రోడ్డు పల్లంగా ఉంటుంది. ఈ కారణంగా వర్షపు నీరు, డ్రెయినేజీలు పూడుకు పోయి మురుగు నీరు బయటకు పారుదల లేక రోడ్డుపైకి వచ్చి చేరుతుంది. ఒకపక్క మురుగునీరు, మరో పక్క వర్షం నీరు కలిసి ఈ రోడ్డుపై కిలోమీటర్ పైబడి ప్రవహిస్తాయి. ఈ రూట్‌లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎట్టకేలకు సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ రహదారిలో పక్కా సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలోని అన్ని డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టి మురుగనీరు పారుదలకు అడ్డంకిగా ఉన్న అవరోధాలను ఇప్పటికే తొలగించారు. దీంతో ముదినేపల్లి ముంపు బారి సమస్య నుంచి బయట పడినట్లయింది.

పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు బాధాకరం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్


ఇటీవల డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సమస్త స్ఫూర్తిని కొనియాడడం దుర్మార్గమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అన్నారు. జంగారెడ్డిగూడెం బుధవారం ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాని అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి తొత్తుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, అహింస మార్గంలో నడిచిన మహనీయుడు మహాత్మా గాంధీ హత్యకు పాల్పడిన ఆర్ఎస్ఎస్, ఢిల్లీ సరిహద్దుల్లో రైతు ఉద్యమంలో ధమనకాండ రేపిన ఆర్ఎస్ఎస్, మణిపూర్ సంఘటనలో మహిళలను నగ్నంగా అతి కిరాతకంగా చంపిన సంఘటనలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఉందని ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, జార్ఖండ్ రాష్ట్రంలో క్రిస్టియన్ పాస్టర్లను ఊస కోత కోసి చంపిన ఆర్ఎస్ఎస్ సంస్థ దేనికి ఆదర్శమో పవన్ కళ్యాణ్ తెలియచేయాలని అన్నారు. నిరంతరం చేగువేరాను స్మరిస్తున్న పవన్ కళ్యాణ్ గతంలో కమ్యూనిస్టుల స్ఫూర్తి, చేగువేరా స్ఫూర్తి అన్న నినాదాన్ని పక్కనపెట్టి ఈరోజున ఆర్ఎస్ఎస్ స్ఫూర్తిని కొనియాడడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో ఉన్న యువతీ యువకులు, స్వతంత్ర పోరాట యోధులు, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, గాంధీజీ, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

చెత్తా చెదారంతో

చిన వెంకన్న నృసింహసాగరం


ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రాష్ట్రంలో దేవాలయాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిన వెంకన్న దేవస్థానం ద్వారకా తిరుమల ఎంతో ప్రసిద్ధి గాంచింది. ద్వారకా తిరుమల చిన వెంకన్న తెప్పోత్సవం ప్రతి సంవత్సరం క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం రోజున జరుపుతారు. ఆరోజు స్వామి వారు ఉభయనాంచారులతో కలిసి పుష్కరిణిలో విహరిస్తారు. అలాంటి స్వామి వారి నృసింహసాగరం ప్రస్తుతం పసరు, చెత్తా చెదారంతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. స్వామి వారి పుష్కరిణిలో పూర్వం డబ్బులు వేస్తే కంటికి కనిపించే విధంగా నీరు అంత స్వచ్ఛంగా ఉండేదని, ప్రస్తుతం పశువులు కూడా నీళ్లు తాగలేని విధంగా పసరు, చెత్త పేరుకుపోయి వున్నదని గ్రామస్తులు అంటున్నారు. పూర్వం ప్రతిరోజు ఈ నృసింహసాగరం నుండే స్వామివారికి వేకువజామున తీర్థపు బిందె వెళ్లేది, యాత్రికులు స్నానాలు చేసి స్వామి వారి దర్శనానికి వెళ్లేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. దేవస్థానం వారు ఇప్పటికైనా నృసింహసాగరంను పరిశీలించి, పరిశుభ్రతా చర్యలు తీసుకుని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు, భక్తులు కోరుచున్నారు.


గుర్రపు డెక్క పేరుకుపోయిన చినవెంకన్న నృసింహసాగరం

ఘనంగా టిడిపి అధ్యక్షుడి పుట్టినరోజు

ప్రజాశక్తి - కుక్కునూరు


రోదులకు బ్రెడ్ అందజేస్తున్న నాగు

మండలంలోని టిడిపి అధ్యక్షులు మొలిశెట్టి నాగేశ్వరరావు(నాగు) పుట్టినరోజు వేడుకలు కుక్కునూరు పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా కస్తూరిబాగాంధీ పాఠశాలలో విద్యార్థినీలకు పుట్టినరోజు సందర్భంగా బిస్కెట్లు, చాక్లెట్లు, పండ్లు అందించారు. పిల్లలందరూ వారి మీద అభిమానంతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని దీవించారు. తదనంతరం గ్రామంలోని పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మొక్కలను నాటారు. ప్రతి ఒక్క కార్యకర్తకు తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజు వేడుకలప్పుడు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ప్రాథమికఆరోగ్య వైద్యశాలను సందర్శించి అక్కడున్నటువంటి రోగులకు బ్రెడ్, పాలు, పండ్లు పంచారు. ప్రతి ఒక్క రోగిని పరామర్శించి వారి యోగ క్షేమాలు తెలుసుకొని వారికి నాణ్యమైన వైద్యం అందించమని అక్కడున్న వైద్యాధికారులను సూచించారు. మండల కార్యకర్తల ఆధ్వర్యంలో 15 కేజీల భారీ కేకును కట్ చేసి పుట్టినరోజు వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో వారి నాయకుడు ఫ్లెక్సీలతో సామాజిక కార్యక్రమాల్లో ముందుండి నడిపించడంలో టిడిపి శ్రేణులు, జనసేన, బిజెపి నాయకులు విజయం సాధించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, పులి శ్రీను, పిచ్చుక రాజు, కుచర్లపాటి రవణ రాజు, లంకల రాజు, ములిసెట్టి నరేష్, నరుకుల్ల సత్యనారాయణ, కోవాసి నాగార్జున, రుద్ర రవణ రాజు పాల్గొన్నారు.

అడవులు జీవ వైవిధ్యానికి నిలయాలు

బంజారా బజరంగీ భేరి నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అడవులు జీవ వైవిధ్య నిలయాలు మాత్రమే కాకుండా మానవ అవసరాలను తీరుస్తూ, పర్యావరణాన్ని కాపాడే రక్షకులు అని బంజారా బజరంగీ నాయకులు అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామ అడవుల్లో బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో వేప, నేరేడు, జీడి, మామిడి, పనస, కుంకుడు, సీతాఫలం మొదలగు విత్తనాలు సభ్యులు చల్లారు. ఈ సందర్భంగా ఆ కమిటీ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ సీతలా భవాని అడవులను రక్షించి పశువులను, మానవులను కాపాడే బంజారాల వన దేవత అని తెలిపారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ ఒకప్పుడు దట్టమైన అటవీప్రాంతంగా విరాజిల్లిన టి.నర్సాపురం మండలంలో ప్రస్తుతం అడవులు వేగంగా అంతరించి పోతున్నాయని, వీటిని కాపాడుకోడానికి లక్ష విత్తనాలు చల్లే కార్యక్రమం పెట్టుకుని వేప, జీడి, మావిడి,పనస, కుంకుడు, నేరేడు, సీతాఫలం లాంటి విత్తనాలు కృష్ణాపురం అడవుల్లో చల్లామని అన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు జరభల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అడవులు అంతరించిపోతే మానవాళి మనుగడకే ప్రమాదమని అన్నారు. అందుకే అడవులను కాపాడుకోవాల్సిన అసవరం ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా బిగనాధం, ధరావత్ రవి, బంగారయ్య, హసావత్ రవీంద్ర, భూక్యా రాములు, శ్రీనివాస్, భూక్యా చంటి, సురేష్, బద్దుబాబు, జరభల బాలకృష్ణ పాల్గొన్నారు.


విత్తనాలు చూపుతున్న కమిటీ సభ్యులు

యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డిఎల్‌టిసి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద 'ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్' కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పదో తరగతి, ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9493482414 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని డి3 - ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ శాంతినగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ విఐపి ఫీడర్‌కు చెట్టు కొమ్మల తొలగింపు, లైన్లకు మరమ్మతు చేయుటకు ఈనెల 18వ తేదీ గురువారం నాడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు. టిటిడి కళ్యాణ మండపం, సిఆర్ఆర్ కాలేజీ ఏరియా, కలెక్టర్ బంగ్లా, జెడ్‌పి బంగ్లా, జెవియర్ హైస్కూల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా కోరారు.

టిడిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని వెలగపాడు పంచాయతీలో ఇటీవల అనారోగ్యానికి గురైన టిడిపి నాయకులు బొడ్డు సింహాచలం, గూట్ల ఏసుపాదం, మాణిక్యంలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు బుధవారం పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ విశేష సేవలందించారన్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు సర్పంచి జలపాలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించి, చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దశాబ్ద కాలంపైగా చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు జరగకపోవడంతో ఆయా సంఘాల అభివృద్ధి కుంటుపడుతునందున రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తక్షణమే సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించాలని ఆయన కోరారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

గురుకుల పాఠశాలలో ఎంఎల్ఎ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని బుసరాజుపల్లి ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను మధ్యాహ్నం భోజన సమయంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. క్లాస్ రూమ్ము, వంటశాలను పరిశీలించి, భోజనం మెనూ ప్రకారం పెట్టాలని, ఏవైనా అవకతవకలు రాకుండా జాగ్రత్తగా పని చేయాలని సూచించారు. స్కూల్, కాలేజీలో ఉన్న పలు సమస్యలపై ఐటిడిఎ పిఒ సూరతేజతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. సెక్యూరిటీకి కావలసిన షెల్టర్‌ని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం నాగకృష్ణ, జనసేన మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు, జనసేన మండల ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

మంత్రి పార్థసారథిని కలిసిన ఎంఎల్ఎ చింతమనేని

నూజివీడు టౌన్ : రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. దెందులూరు నియోజకవర్గంలోని రోడ్లు, హౌసింగ్‌కు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ అంశాలపై మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జిల్లా, దెందులూరు నియోజకవర్గానికి అన్ని విధాలుగా తోడ్పాటు చేసి, అభివృద్ధి పథంలో కలిసి పని చేద్దామని హామీ ఇచ్చారు. చింతమనేని ప్రభాకరరావు వెంట పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.